
నారాయణ శతకము (పాట)

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



శ్రీ నారాయణ శతకము (పాట)

ప్రార్థన

01. నమామి నారాయణ పాద పంకజం। వదామి నారాయణ నామనిర్మలం
భజామి నారాయణ తత్త్వమవ్యయం। కరోమి నారాయణ పూజనం సదా॥

ఆలోక్య సర్వ శాస్త్రాణి। విచార్య చ పునః పునః।
ఇదమేకం తు(సు)నిష్పన్నం। ధ్యాయేత్ నారాయణం సదా ॥

---

02. పాపకర్మముల జేసి, నరక కూపముల బడజాల నికను।
నీపాద భక్తి యొ(నొ)సగి, యొక్కదరి జూపవే నారాయణా॥

03. దానధర్మముల జేయనేర, నీ దాసులను బొగడనేర।
నా నేరముల దలపక, దయచేసి నన్నేలు నారాయణా॥

04. ఆన యించుకలేకను, దుర్భాషలాడు నా జిహ్వాయందు।
నీ నామ చతురక్షరి, దృఢముగా నిలువపలె నారాయణా॥

05. ఒకటి పరిశుద్ధిలేక, నా జన్మ మకట! వ్యర్థంబాయెను।
అకలంకమగు మార్గమున్, జూపవే సకలేశ నారాయణా॥

06. వేగి లేచినది మొదలు, సంసారసాగరంబున నీదుచు।
మీగుణము నొకవేళను, దలపగదె మేలనుచు నారాయణా॥

07. లోకవార్తలకు మరగి, కర్ణముల మీ కథల విననేరను।
ఏ కరణి భవజలనిధీ, దుదముట్టు నీదుదును నారాయణా॥

08. ఇల మనుజ జన్మమెత్తి, సుజ్ఞానమించుకంతయు లేకను।
కలతజెందెడు చిత్తమున్, స్వచ్ఛంబుగా జేయు నారాయణా॥

09. ఎంత పాపాత్ముడైన, మిముదలచి కృతకృత్యుడౌనుబుడమి।
నింతపరుసము సోకిన, లోహంబు హేమమౌ నారాయణా॥

10. కామాంధకారమునను, బెక్కుదుష్కర్మముల జేసి నేను।
నీ మఱుగు జొచ్చినాను, నామీదనెనరుంచు నారాయణా॥

11. సమయమైనపుడు మిమ్ము, దలచుటకు శక్తిగలుగునో గలుగదో।
సమయమని తలతునిపుడు, నా హృదయకమలమున నారాయణా॥

12. ఆటలన్నియు అంకులు, నేనాడు మాటలన్నియు బొంకులు।
పాటింప నింతకంటె, నున్నదే పాపంబు నారాయణా॥

13. వావి దప్పినవాడను, దుష్క్రియా వర్తనుడ నగుదు నేను।
బావనునిగా జేయవే, నను బతితపావనుట నారాయణా॥

14. దేహమే దృఢమనుచును, దెలిసి నేమోహబద్ధుడ నగుచును।
సాహసంబున, జేసితి, నే గురుద్రోహంబు నారాయణా॥

15. ఎన్ని జన్మము లాయెనో, నేటి కెందెందు జన్మించినానో।
నన్ను దరిజేర్పగదవే, యికనైన నాతండ్రి నారాయణా॥

16. యమకింకరుల దలచిన, నాగుండె యావులింపుచు నున్నది।
యమునిబాధల మాన్పను, మాయప్ప వైద్యుడవు నారాయణా॥

17. అరయగామక్రోధముల్, లోభంబుమోహమద మత్సరములు।
తఱుగ వెప్పుడు మనసున, నిన్నెపుడు దలచెదను నారాయణా॥

18. ఆశాపిశాచిపట్టి, వైరాగ్య వాసనల జేరనీయదు।
గాసిపెట్టుచు నున్నది, నేనేమి చేయుదును నారాయణా॥

19. తాపత్రయంబు జెంది, చాల పరితాపమొందెడు చిత్తము।
నీపాదముల జెందిన, జల్లనై నిలుచుగద నారాయణా॥

20. చింతా పరంపరలచే, జిత్తంబు చీకాకు పడుచున్నది।
సంతోషమునుగూర్పవే, దివ్యప్రసాదమున నారాయణా॥

21. ప్రాయమెల్లను బోయెను, నాశలెడబాయ జాలకయున్నవి।
మాయాప్రపంచమేల, చేసెదవు మాయయ్య నారాయణా॥

22. శరణు జొచ్చినవాడను, నేజేయు దురితముల నపహరించి।
పరమపదమొసగగదవే, యికనైన బరమాత్మ నారాయణా॥

23. సంకల్పముల బుట్టిన, కర్మవాసనలు దృఢముగ జేయవు।
సంకటము నొందించకే, నను సత్యసంకల్ప నారాయణా॥
24. ఒక వేళ నున్న బుద్ధి, యొకవేళ నుండదిక నేమి సేతు।
సకలంకముగ జేయవే, నీవు నా చిత్తమును నారాయణా॥
25. నెట్టుకొని సకలజీవకోటులను, గొట్టి భక్షించినాను।
పొట్టకొఱకై నీచుల సేవించి, రట్టయితి నారాయణా॥
26. నేను బుట్టినది మొదలు, ఆహార నిద్రలను జనెగాలము।
పూని యెప్పుడు సేయుదు, నీ పద ధ్యానంబు నారాయణా॥
27. ప్రొద్దు వోపకయున్నను, వేసరక పొరుగిండ్ల దిరుగుగానీ।
బుద్ధి మాలిన చిత్తము, నీయందు బొందదే నారాయణా॥
28. ఎన్నివిధముల జూచిన, నిత్యమును హృదయమున మిము మఱువక।
యున్నంతకన్న సుఖము, వేఱొక్కటున్నదే నారాయణా॥
29. లాభ లోభముల విడచి, యిహపరంబులను ఫలమాసింపక।
నీభక్తులైనవారు, ధన్యులై నెగెడెదరు నారాయణా॥
30. ముందు నీ సృష్టి లేక, సచ్చిదానంద స్వరూపంబును।
బొంది భేదము నొందక, బ్రహ్మమై యుందువట నారాయణా॥
31. కాలత్రయాబాధ్యమై, మఱి నిరాకారమై యుండు కతన।
జాలగా దత్త్వజ్ఞులు, తెలియుదురు సత్తనుచు నారాయణా॥
32. జ్ఞానస్వరూపముననను, నజడమై జడపదార్థముల నెల్ల।
గానగా జేయుకతన, జిత్తంద్రు ఘనును నిను నారాయణా॥
33. సుఖ దుఃఖముల రెంటికి, వేఱగుచు సుఖరూపమైన కతన।
అఖిల వేదాంతవిదులు, ఆనందమంద్రు నిను నారాయణా॥
34. గుణమొకటియైన లేని, నీయందు గుణమయంబైన మాయ।
గణుతింప గనుపట్టెడు, దర్పణము కైవడిని నారాయణా॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

35. అందు బ్రతిబింబించిన, చిత్సదానంద సముదాయమెల్ల।
జెందు నీశ్వరభావము, త్రిగుణసంశ్లిష్టమై నారాయణా॥

36. సత్వంబు రజము తమము, నను మూడు సంజ్ఞలను క్రమముతోడ।
దత్వజ్ఞులేర్పరింప, దద్గుణత్రయములగు నారాయణా॥

37. ప్రకృతి నీయందు, లీన మయియుండి వికృతిజెందిన వేళను।
సకలప్రపంచమిటుల, గనుపట్టె నకలంక నారాయణా॥

38. మీరు సంకల్పించిన, యిష్టప్రకారమున జెందు మాయ।
ఆరూఢి వివరించెద, నవ్విధం బొప్పంగ నారాయణా॥

39. పంచభూతములు మనసు, బుద్ధియును బ్రకటహంకారంబును।
నెంచంగ నాయె మాయ, యిదిగా ప్రపంచంబు నారాయణా॥

40. భూతపంచకసత్వ, సంఘాతమున బుట్టె నంతఃకరణము।
ఖ్యాతిగా నందు దోచు, చిత్తె జీవాత్మయె నారాయణా॥

41. వెసమనో బుద్ధి చిత్తా, హంకార వృత్తు లంతఃకరణము।
ప్రసరించినవి నాలుగు, తత్త్వరూపములాయె నారాయణా॥

42. భౌతిక రజోగుణములు, నేకమై ప్రాణంబు బుట్టించెను।
వృత్తిభేదములచేత, బంచ భావములాయె నారాయణా॥

43. అలరు ప్రాణ మపానము, వ్యానంబు దా సమానోదానముల్।
తలప నీ సంజ్ఞలమరి, వాయుతత్త్వము లొప్పు నారాయణా॥

44. ప్రత్యేక భూత సత్వ, గుణములను బరగ బుద్ధీంద్రియములు।
సత్వమున జనియించెను, తత్త్వపంచకమగుచు నారాయణా॥

45. చెవులు చర్మము కన్నులు, జిహ్వా నాసికము పేరులచేతను।
తవిలి బుద్ధీంద్రియములు, విషయ సంతతి దెలియు నారాయణా॥

46. భౌతిక తమోగుణమున, విషయములు తఱుచుగా జనియించెను।
శబ్ద సంస్పర్శ రూప, రస గంధ నామములు నారాయణా॥

47. తాదృశ రజోగుణమున, జనియించె నరక కర్మేంద్రియములు।
ఐదు తత్త్వములగుచును, గర్మనిష్ఠాదులకు నారాయణా॥

48. వాక్పాణి పాదపాయూపస్థలను, వాని వేళ్ళమరుచుండు।
బక్వహృదయులకు దెలియు, నీ విధము పరమాత్మ నారాయణా॥

49. పలుకు పనులును నడకయు, మల మూత్రముల విడుచుటీ యైదును।
వెలయ గర్మేంద్రియముల, విషయములు నలినాక్ష నారాయణా॥

50. పరగజంద్రుండు బ్రహ్మ, క్షేత్రజ్ఞుడిరవొంద రుద్రుడచట।
పరమానసాదులకును, నధిపతులు వివరింప నారాయణా॥

51. అరయ దిక్కులు వాయువు, సూర్యుడును, వరుణుండు నశ్వినులును।
పరగ శ్రోత్రాదులకును, నధిపతులు పరికింప నారాయణా॥

52. అనలుడింద్రుడు విష్ణువు, మృత్యువును నల ప్రజాపతియు గూడి।
యొనర వాగాదులకును, నధిపతులు పరికింప నారాయణా॥

53. పంచీకృతంబాయెను, భూతపంచకము ప్రబలించి సృష్టి।
బంచీకృతముచేతను, స్థూలరూపములాయె నారాయణా॥

54. పదియింద్రియములు మనసు, బుద్ధియును బ్రాణంబులైదుగూడి।
పదియేడు తత్త్వములును, సూక్ష్మదేహంబాయె నారాయణా॥

55. స్థూల సూక్ష్మములు రెండు, గలుగుటకు మూలమగు నజ్ఞానము।
లీల కారణమాయెను, జీవులకు నా లోన నారాయణా॥

56. ఈ రెండు దేహములకు, విశ్వంబదెల్ల బ్రకటంబాయెను।
నామరూపములచేత, లోకైక నాయకుడ నారాయణా॥

57. కొన్ని మావిని బుట్టును, గ్రుడ్లలో గొన్ని తనువులు పుట్టును।
కొన్ని ధరణికి బుట్టును, జెమటలకు గొన్ని హరి నారాయణా॥

58. ఈ చతుర్విధ భూతములందు, గడు హెచ్చు మానవజన్మము।
నీచమని చూడరాదు, తథ్యమే నిర్ణయము నారాయణా॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

59. ఈ జన్మమందె కాని, ముక్తి మఱి యే జన్మమందు లేదు।
చేజేత దను దెలియక, మానవుడు చెడిపోవు నారాయణా॥

60 చేతనా చేతనముల, బుట్టుచును రోతలకు లోనగుచును।
నాటంకపడుచుండును, గర్మములజేతనుడు నారాయణా॥

61. సకలయోనుల బుట్టుచు, బలుమాఱు స్వర్గనరకముల బడుచును।
నొకట నూఱటగానక, పరితాపమొందితిని నారాయణా॥

62. వెలయ నెనుబదినాలుగు, లక్షలయోనులయందు బుట్టిగిట్టి।
యలసిమూర్ఛల జెందుచు, బహుదుఃఖములచేత నారాయణా॥

63. క్రమముతో మనుజగర్భమున బడియు, గర్మవశగతుడగుచును।
నమితముగ నచ్చోటను గర్భనరకమునబడి నారాయణా।

64. ఈశ్వరాజ్ఞను బుట్టిన, తెలివిచే హృదయమున దలపోయుచు।
విశ్వమున దనుబొందిన, పాట్లెల్ల వేర్వేఱ నారాయణా॥

65. చాలు ఛీ!యిక జన్మము, మరణంబునెల్ల శ్రీహరి భజించి।
మేలు చెందెద ననుచును, జింతించు నాలోన నారాయణా॥

66. ప్రసవకాలమున దల్లి, గర్భమున బాదుకొని నిలువలేక।
వసుధపయి నూడిపడిన, తెలివిచే వాపోవు నారాయణా॥

67. చనుబాలు గుడిచి, ప్రాణ ధారణను మూత్ర మలములోను।
మునిగి తేలుచు నుండును, దుర్గంధమున శిశువు నారాయణా॥

68. బాలత్వమున బిత్తరై, నలుగడల బాఱాడు సిగ్గులేక।
పాలుపడి యౌవనమున, విషయానుభవమొందు నారాయణా॥

69. ముదిమి వచ్చిన వెకను, సంసారమోహంబు మానలేక।
తుది నేగు గర్మ గతుల, బొందుటకు ముదమేమి నారాయణా॥

70. అజ్ఞాన లక్షణంబు, లిటువంటివని విచారించి నరుడు।
సుజ్ఞానమునకు దగిన, మార్గంబు చూడవలె నారాయణా॥

71. వేదాంత వేదియైన, సద్గురుని పాదపద్మముల జెంది।
ఆ దయానిధి కరుణచే, సద్బోధమందవలె నారాయణా॥

72. ఏ విద్యకైన గురువు, లేకున్న నా విద్య పట్టుపడదు।
కావునను అభ్యాసికి, గురు శిక్ష కావలెను నారాయణా॥

73. గురు ముఖంబున విద్యల, నెన్ని గైకొనక భావ జ్ఞానము।
జిరతరాధ్యాత్మ విద్య, నభ్యసింపగ లేదు నారాయణా॥

74. నిరపేక్షకుడుసదయుడు, వేదాంతనిపుణుడౌయాచార్యుడు।
దొరకుటకు రూపమపుడు, గుణుతైనగుటియొప్పు నారాయణా॥

75. అట్టి సద్గురుని వెదకి, దర్శించి యా మహాత్ముని పదముల।
బట్టి కృతకృత్యుడౌను, సాధకుడు గట్టిగా నారాయణా॥

76. మొగి సాధనములు నాలుగు, గల నరుడు ముఖ్యాధికారి యగును।
దగిన యుపదేశమునకు, యోగసాధకులలో నారాయణా॥

77. ఇది నిత్యమిదియనిత్యం, బనుచును తనమది వివేకించుటొకటి।
ఎదను నిహపర సుఖముల గోరనిది యిది యొకటి నారాయణా॥

78. ముదముతో శమదమాది షట్కసంపద కలిగియుండు టొకటి।
విదితముగ ముక్తి బొంద, గాంక్షించుటది యొకటి నారాయణా॥

79. ఈ నాల్గు సాధనముల, నధకారాయై నిజాచార్యుజేర।
నానా ప్రకారములను, శుశ్రూష నడుపవలె నారాయణా॥

80. ఉల్లమున గాపట్యము, లవమైన నుండనియ్యక నిరతము।
తల్లి దండ్రియు దైవము, గురువనుచు దలపవలె నారాయణా।

81. తనువు మనసును సంపద, గురుని సొమ్మని సమర్పణము జేసి।
ఎనసి తత్పరతంత్రుడై, నిత్యమును మెలగవలె నారాయణా॥

82. ఏనిష్ఠ గురు నిష్ఠకు, దీటుగాదీ ప్రపంచంబునందు।
మానసము దృఢము జేసి, యలరవలె మౌనియై నారాయణా॥

83. ఇట్టి శిష్యుని పాత్రతత, వీక్షించి హృదయమున గారుణ్యము।
నెట్టుకొని బ్రహ్మవిద్య, గురుడొసగు నెయ్యమున నారాయణా॥

84. బ్రహ్మంబు గలుగగానే, యేతత్ప్రపంచంబు గలిగియుండు।
బ్రహ్మంబు లేకున్నను, లేదీ ప్రపంచంబు నారాయణా॥

85. ఈ విధంబున సూక్తుల, బ్రహ్మసద్భావంబు గలుగ జేసి।
భావగోచరముజేయు, జిత్స్వరూపములెల్ల నారాయణా॥

86. ఆ బ్రహ్మమందె పుట్టు, విశ్వంబు నాబ్రహ్మమందేయుండు।
నాబ్రహ్మమందెయణగు, నదె చూడుమని చూపు నారాయణా॥

87. అది సచ్చిదానందము, అదిశుద్ధ మది బుద్ధమది యుక్తము।
అది సత్య మదినిత్యము, అది విమలమని తెలుపు నారాయణా॥

88. అదెబ్రహ్మ యదివిష్ణువు, అదె రుద్రుడదియె సర్వేశ్వరుండు।
అది పరంజ్యోతి యనుచు, బోధించు విదితముగ నారాయణా॥

89. భావింప వశముగాదు, ఇట్టిదని పలుకశక్యంబు కాదు।
భావంబు నిలుపుచోట, నది తాను పరమౌను నారాయణా॥

90. అది మాయతో గూడగ శివుడాయె, నదియవిద్యనుగూడగ।
విదితముగ జీవు డాయె, నని తెలుపు వేర్వేఱ నారాయణా॥

91. శివుడు కారణశరీరి, కార్యంబు జీవుడాలక్షణములు।
ద్వివిధముగ తెలియు మనుచు, బోధించు వివరముగ నారాయణా॥

92. అరయ నిరువదినాలుగు, తత్త్వంబులై యుండు చందములను।
కరతలామలకముగను, బోధించు బ్రకటముగ నారాయణా॥

93. కారణము కార్యమగుచు, వ్యవహార కారణాఖ్యత నుండును।
నారూఢి బ్రహ్మాండము, పిండాండమని తెలుపు నారాయణా॥

94, ఐదు భూతములు, నింద్రియములు పది, యంతరంగములు నాల్గు।
ఐదు విషయములు, తత్త్వసంఘాత మని తెలుపు నారాయణా॥

95. స్థూల సూక్ష్మాకృతులును, గారణముతో మూడుతెఱగులగును।
మూలమగు జలనభాగ్ను, లని తెలుపు లాలించి నారాయణా॥

96. వెలసి పంచీకృతములు, నగుభూతములకు బుట్టినతనువు।
అలస్థూలమగుననుచును, బోధించుదయతోడ నారాయణా॥

97. ఐదు నయిదింద్రియములు, ప్రాణంబులయిదు మనసును బుద్ధియు।
బాదుకొని సూక్ష్మమందు, బోధించు బ్రకటముగ నారాయణా॥

98. గాఢమగు నజ్ఞానము, ఈ రీతి గారణ శరీరమగును।
మూఢులకు వశముగాదు, తెలియ విను మోదమున నారాయణా॥

99. ఈ మూడు తనువులందు, దానుండి యీ తనువు తాననుచును।
వ్యామోహపడుచుండును, జీవుండు వరుసతో నారాయణా॥

100. కలలేక నిద్రించును, కలగాంచి కడుమేలు కొనుచుండును।
కలకాలమీజీవుడు, త్రివిధముల గలసియును నారాయణా॥

101. ప్రాజ్ఞ తైజస విశ్వులు, తానె యీ పర్యాయముగ జీవుడు।
ప్రజ్ఞ గోల్పడి పొందును, సంసారబంధంబు నారాయణా॥

102. మూడవస్థలకు సాక్షి, యైనట్టి మూలంబుదా దెలిపియు।
చూడుమని తన్మార్గము, దేటగా జూపును నారాయణా॥

103. నీవు దేహంబుగావు, ప్రాణంబు నీవుగావు నింద్రియములు
నీవు గాదని తెలుపును, వేదాంత నియమమున నారాయణా॥

104. అనల తప్తంబుగాదు, జలమునను మునిగి తడి జెందబోదు।
అనిల శుష్కంబు గాదు, నిరుపమంబని తెలుపు నారాయణా॥

105. కావహంకారమిపుడు చిత్తంబు, గావు బుద్ధి నీవు-
కావు మనసును, సత్యము, సాక్షివగు గట్టిగా నారాయణా॥

106. దేహధర్మములు నీకు, దోచుటంతే గాని నిత్యముగను।
మోహంబుమానుమనుచు, బోధించు ముఖ్యముగ నారాయణా॥

107. ఎన్ని దేహములు చెడిన, నీవు చెడవేకస్వరూపుండవగుట।
జెన్నలరి యుందువిలను, దత్త్వప్రసిద్ధముగ నారాయణా॥

108. అన్ని వేదాంతవాక్యములలో, మహావాక్యములు నాలుగు।
నిన్ను బ్రహ్మంబుగాను, వర్ణించు నిక్కముగ నారాయణా॥

109. ఉభయ దృశ్యోపాధుల, గడద్రోసిపోకయయ్యాత్మ మిగులు।
నభయముగ నిటులెప్పుడు, చింతింపుమని తెలుపు నారాయణా॥

110. జీవశివతారతమ్యముల, కైక్యసిద్ధి గానేరదనుచు।
భావసంశయము దీర్చు, కార్యార్థ పటిమచే నారాయణా॥

111. నిర్వికారుడవు నీవు, నీ యందె నిజమైన చందముననుు।
బర్వు బ్రకృతివికారము, లని తెలుపు ప్రౌఢిచే నారాయణా॥

112. సద్గురుఁడీరీతిగా, బోధించు సరళితో వాక్యార్థము।
హృద్గతము జేసియుండి, జగతి జీవింపుచును నారాయణా॥

113. అని చింతనముజేయుచు, జిత్తమునదనివి జెందుచు నెపుడును।
కమదమ్ములను ముడుచుచు, తన్మయము నొందుచును నారాయణా।

114. అపగతాఘకృత్యుడై, యీా రీతి నభ్యాస మొనరించుచు।
నపరోక్షసిద్ధినొందు, బ్రహ్మంబు తానగుచు నారాయణా॥

115. కందళిత హృదయుడగుచు, సచ్చిదానందస్వరూపుడగుచు।
సందర్శితాత్ముడగుచు, నుండు నవికారతను నారాయణా॥

116. అవ్యయానంద పూజ్య, రాజ్యసింహాసనాసీనుడగుచు।
భవ్యాత్ముడై వెలసెను, బూజ్యసంభావ్యుడై నారాయణా॥

117. నీవు సకలంబుగాని, యున్నదే నీ కన్న వేఱొక్కటి।
జీవుడని వర్ణించుట, వ్యవహార సిద్ధికిని నారాయణా॥

118. చిలుక పలుకుల బలికితిని, నాకేమితెలియు, దత్త్వరహస్యము।
వలదునను నేరమెంచ, సాధులకు నలినాక్ష నారాయణా॥

119. శరణు భక్తార్తిహారి, గురురూప శరణు సజ్జన రక్షక।
శరణు దురితౌఘనాశ, శరణిపుడు కరుణించు నారాయణా।
శరణిపుడు కరుణించు నారాయణా।

120. కాయేన వాచా మనసేంద్రియైర్వా, బుద్ధ్యాత్మనావా ప్రకృతే స్స్వభావాత్।
కరోమియద్యత్సకలం పరస్మై, నారాయణా యేతి సమర్పయామి॥
నారాయణా యేతి సమర్పయామి॥

॥ లోకాః సమస్తాః సుఖినో భవన్తు ॥



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)